# సెమిటరి అవతల - సిమెంట్ మేడ

—• గీతిక •—

" కానీ లేదు - కడవ లేదు
గోనీ లేదు - గొంగళి లేదు
కాపరమెక్కడ - కాంతా అంటే
సెమిటరి అవతల సెమింట్ మేడ—
బోణీ లేదు - బోణం లేదు
దాణా లేదు - దవుడు లేదు
గాజు లెక్కడికి - బలిజీ అంటే
సెమిటరి అవతల సెమింట్ మేడ—
దారువు లేదు - చెరువు లేదు
మోవు లేదు - పూవు లేదు
తూగేందుకు వోయి తోటీ అంటే
సెమిటరి అవతల సెమింట్ మేడ. "

అందరి గొంతుల్నుంచీ " సెమిటరి అవతల సెమింట్ మేడ" అనే జవాబుతప్ప మరోజవాబు లేనేలేదు. " సెమిటరి " అన్నది నేను ఎఱుగుదును. చాలా కాలంనుంచి దాని గోడలు, దాని గుమ్మాలు, దానిలోనుంచి పైకి తలచూపే " టూంబు " ల మీది " క్రాసు " లు నా కవగాహనే. చనిపోయిన " జాతిదొరల " శరీరాల్ని భూస్థాపనచేసిన స్థల మది. ఆ స్థలానికంతకూ ఇంగ్లీషులో " సెమిటరీ " అంటారు. పాతులకు " టూంబు " లంటారు. పాతులమీది మతచిహ్నాలకు " క్రాసు" లంటారు. ఆ "సెమిటరీ" అవతల ఏమున్నదీ నే నీవరలో విచారించింది లేదు. కాని సెమిటరీకూడా పట్నంలో వోభాగమే అని గుర్తిం

చాను. బ్రదికివున్న మెదుకుల రాయళ్ల విషయమై యెట్టి జాగ్రత్త తీసుకొని వారియెడల ఎట్టి సామరస్యభావం తాను వహిస్తూ వుంటుందో అంతకంటె వేయిరెట్లెక్కుడు సామరస్యము పురపాలసంఘ మా సిమిటరీవంక చూపిస్తూ వచ్చినట్టు నేను గతంలో తెలిసికొని యున్నాను. మఱి సెమిటరీ అవతల ? గోడే వుందో గొందేవుందో ప్రాణేవుందో ప్రతిమేవుందో గుడిసే వుందో గృహమేవుందో ఎవరికెరుక ? ఎరిగివున్నా ఎవరికి అటువైపు దృష్టిపరుగు !

వరుసగా ఒక్క గ్రుక్క నొక్కనాటి ఉదయమందు పై విధంగా ముగ్గొంతుదేఱి "సెమిటరి అవతల సిమెంటుమేడ" అన్న జవాబు ముఖరితం కావడంతోనే నాలో ఒకరకమైన ఆశ్చర్యం రెచ్చింది. "ఈ పట్నంలో—నేనింతకాలం తిరుగుతూ వచ్చిన ఈ పురవరంలో సెమిటరీకి అవతల "సెమెంట్‌మేడా ? ఎప్పుడు నిర్మింపబడింది ? ఎవరిచేత నిర్మింపబడింది ? ఎవరిది అది ? ఈలా ఇప్పుడు జవాబు చెబుతూ వెళ్ళిన కాంతదేనా ఆ మేడ ? ఆ కాంత తొడిగించుకోదలచిన గాజులేవా ఆ బలిజీ తన బక్కతేజీమీద వేసుకు వెడుతూ వున్నది ? తోటీ ఆ మేడ తుడిచీవాడా ? ఆ మేడ కడిగీవాడా ? లేక దాని కధినాధుదేవాడా? చాలా ఆశ్చర్యంగా వుందే !" అని అనుకొంటూ ఆ ఉదయం ఆదాకా అసలు నేను ఆ పట్నంలో కనుగొన్న పంథానంతనూ సింహావలోకనంగా తిలకింపఁ బ్రారంభించాను.

"నిరాశా" పట్నంలోకి "ఆశా" మహారాజులుంగారు రావడం ఆ యుదయమే మత్తోముహూర్తానికన్న సువార్త జ్ఞప్తికి వచ్చింది. ఆశా మహారాజులుంగారు అవతరించేది "శాంతి దేవళం" లో నుంచి అన్నట్టు తెల్లనిరథం వంతెనమీద

కనబడిందికూడాను. మఱచిపోయాను. ఆ రథం ఆగే తావు ఎత్తు ప్రదేశంగాను, సమప్రదేశంగాను ఆక్రితంసాయంకాలమే కావింపబడింది. మఱీన్నీ ఆ తావున ఓ ఎఱ్ఱనిగుడ్డ మహారాజులుం గారి నడకకోసరంగాను పఱచబడివుంది. ఆ ఎఱ్ఱనిగుడ్డ పఱవబడ్డ నడవ ఏలా వున్నదీ అంటే శాత్రవరుధిరంతో దోమల నెత్తురు కలిపి గచ్చుచేసినట్లుంది. నిద్రాభంగం గావడాని కేమాత్రం వీలులేదు. "జయం! ఆశామహారాజులుంగారికి జయం!" అన్న మహాధ్యానం అక్కణ్ణుంచే బయల్దేఱాలి లాగుంది. ఆలా అగుపించింది ఆ వాతావరణమంతా పరికిస్తే, తరువాతను మార్గమంతా ఊరేగింపుటుత్సవానికిగాను అతి నును పుగా అతివినూతనపు మరమ్మతు గలదిగా చేయబడినది. నగరములోని కుళ్లనీరు శరత్కాలంలో నదీతోయం తేటదేఱి నట్టు తేలుదేఱిందేమో అన్నంత తెలుపై మెఱసిపోయింది. పైపైని ముగ్గుచల్లి ఆరోగ్యశాఖవారు మంత్రించడంతోనే, ఆనీటి చాలునే కల్హార కలికాలు పొడిచినా యేమో అన్నంత సూటిగా పోలీసుల ఎఱ్ఱటోపీలు అడుగడుక్కీ కనబడ సాగినాయి.

దారి కెడ్డెం లేదు తెడ్డెంలేదు. ఎక్కడ చూచినా పూల దండలు పట్టుకు నిలబడ్డవారే. "దయచేయండి! స్వాగతం" అని వేకువజామునుంచీ వేచియున్నవారే. ఆశామహారాజులుం గారు రావడం తడవుగా కరతాళధ్వనులు గావించాలట; ఆబాల గోపాలం దారి కిటూ అటూ బారులుదీఱి—ఇళ్లు పచ్చని తోరణా లతో ప్రభలు చిమ్ముతూ వుండాలిట! పైపులంట పన్నీరు ప్రస రించాలట! ఇవీ అధికారు లిచ్చిన సలహాలు సంజ్ఞలు, కనుసన్నలూను.

"పోలి" అనే పుట్టుమాదిగది అందటితోటిపాటూ తాను ఆ పట్టం పట్టు నంటిపెట్టుకు వీడకుండా వుండే మనిషేను— ఆ క్రితం సంజపొద్దుదాకా యెప్పటిమల్లేనే సంచరించింది. కాని పోలీసువారి హడావిడి చూచి, మోటారు బండ్లల్లోని కొత్తరకం మొఖమల్ బాలీసులు చూచి. ఏదో విడ్డూరం జరగనైయుంది ఎక్కడినోనని విస్తుచూపులు వెట్టిచూపులు వెదజల్లసాగింది. తన వృత్తి తాను మఱచిపోయింది. తన వేషం తాను ఏమరిల్లింది. తానదివఱకు ఎరిగివుండిన్ని పలకరించని ఒకానొక శ్రేష్ఠిని చేరి "సెట్టిగారూ! ఏంటండి? రేపు మనపట్నంలో?" అని అడిగింది.

సెట్టి "ఏముంది! ఏభైమంది ఏభైదబ్బు లేసుకుంటే రూపాయకు మూడణాలన్నర తక్కువ—నీదాకా రారులే ఆశా మహారాజులుంగారు. అయినా నీ యిల్లెక్కడ సొప్పు! నీమీద కూడా ఓ డబ్బడుద్దేమో వాటావేసి చూస్తాను" అన్నాడు.

పోలి "ఎప్పుడూ సెట్టిగారివూసు లిలాగ్గానే వుంటాయి. వాటాలు, కాటాలు, లాభాలు—రాజ్యాలు; నా యిల్లెరగరా మీరు? ఎక్కడని అడుగుతారు? సెమిటరి అవతల సిన్న తాటాకు గుడిసె." అంది.

"ఆసి! నువ్వే! సెప్పు లమ్ముకునే సిన్నాదానివా? ఆలా సొప్పు! యింటిచూరు సెమిటరీ గోడకు సరాసరి లైనులో వుందా? ముందుకు తొంగిచూస్తూ వుందా? చెప్పు!" అన్నాడు సెట్టి. పోలి "కుసింత తొంగేచూస్తుంది చూపువాసి" అంది. "ఇకనేం! చూరంచునే రాజవీధికి కనబడే లా. "సెమెంటు మేడ" అని బల్లకట్టు. ఆకుచూరు అగపడనియ్యకు. మేడే

కనబడవియ్యి. ఆ వెనకాల కొత్తగాజులు వేసుకొని కులుకుతూ కూర్చో, సరిగ్గా రేపుపొద్దున్న పదిగంటలు కాకుండానే ఆశా మహారాజులుంగారు నిన్ను ఆనవాలు పట్టితీరతారు " అన్నాడు.

" నన్ను ఆనవాలు పట్టి నా ఆకలి తీరుస్తారా ? " అంది పోలి.

" నీ ఆకలి ! నా ఆకలి ! అంత ప్రపంచంయొక్క అంత ఆకలి ! తీర్చడానికే వారు రావడం ! అందాకా నీవూ నేనూ బ్రదికి వుండాలి ! అయినా సెమిటరి అవతల వున్నావు నీవు ! నీ దాకా వస్తారోరారో ! భద్రగజం హౌదామీదనుంచైనా చూడరూ ? చూస్తారు ! " అని హెచ్చరించాడు సెట్టి.

సెట్టిగారితో పైసంభాషణ అయిన కాణ్ణుంచీ పోలికి విపరీతంగా మతిపోయింది. మతిపోయిన కొద్దీ కొత్తనమ్మకం వొకటి ఆమె మనస్సులో బయలుదేరింది. " గుడిసె కనిపిస్తే రారుగాని, మేడకనిపిస్తే వస్తారు. తప్పకుండా వస్తారు " అంటూ కార్యరూపం ప్రజ్వరిల్లేలా రస్తాను కట్టబడ్డ తోరణాక్షరాల వంపు సొంపులు తిలకించసాగింది. అప్రయత్నంగా తనతోకూడా ఓ గాజుల బలిజీని గొంపోతూ రెండుచేతుల్ని నిండుగా కన్నుల పండువుగా గాజులు వేయించుకొని, సొంతచూరు కనిపించకుండా ఓ బల్ల అడ్డంపెట్టి బల్లమీద "సెమింట్ మేడ" గీసి తన చేతులు ఎక్కడ పెట్టేది ఎందాకా చూపెట్టేది యోజించసాగింది. తోటీ ఆమె వెనకాతలే వున్నాడు రస్తా తుడిచితుడిచి రెక్కలు ముక్కలై, ఎక్కడ విశ్రాంతి ? ఎక్కడ విశ్రాంతి ? అని అనుకొంటూ, పోలి పాడేపదమే పఠించుకొంటూ. ఏమి పదమది ?

" సెమిటరి అవతల సిమెంట్ మేడ "

*　*　*　*　*

రక్షకభటులు సెమిటరీగోడ చివర వరకు ఆ క్రితం సాయంకాలమే ఆనపెట్టి కట్టుదిట్టం గావించియున్నారు. " కర తాళధ్వనులు గావించండి! చిరునవ్వు నవ్వండి! సింగారాలు చూపించండి!" అని. కాని పోలిని ప్రోత్సహించవలసిన జరుగురు కానలేకపోయినారు. ఆమెయొక్క చూరుఅంచు ఏదాకా వ్యాపించిందీ గమనించలేకపోయినారు. అంచేతే సమయానకు తానేం చేయాలో తెలియలేదు పోలికి. ఆలా "సెమెంటుమేడ"గా గీసికొనివున్న తన బోర్డుబల్లమీద గాజులచేతులు ఆన్చుకొని గమనించసాగింది.

ఏనాటి చనిపోయినవారి శరీరాలున్నూ జీవకళదాల్చి పైకి తెక్కల్తోలేచి గోడలుదూకి కేరింతాలు కొడుతూవున్నట్టు కని పించింది, తొలుదొల్త ఆశామహారాజులుంగారి రాక ఆమె తలుచు కోవడంలో, మలిచూపులో తన శరీరం అస్థిపంజరం అయి పోవడం వినిపించింది. గాజులు ఎముకల గూడున మోగిపోతూ ధ్వనించాయి.

తోటీ తనచేతిలోని చీపురు జారవిడిచి " చేతులతో తప్పెట తట్టు! ఆశామహారాజులు వారేలాగున్నారు! చేతులతో తప్పెటతట్టు!" అని తన చేతులతో తప్పెట తట్టుకుంటూ పోలి ఏంచేస్తూవుందో అని ఆ వంకకు చూచాడు. పోలిముఖం పెద్ద లొడుగు కపాలంగా కనిపించింది. ఆ కపాలఫాలంమీద "సెమిటరి అవతల సిమెంట్ మేడ" అని వ్రాసివుంది.

తోటీకి తోచలేదు ఆ అక్షరాలు తక్షణం తుడిచివెయ్యాలో కడిగివెయ్యాలో, రక్షకభటులకు తరుణోపాయం తట్టలేదు, ఆ బోర్డుబల్ల తగలెయ్యాలో పగలెయ్యాలో సలహా చెప్పిన సెట్టి గారికే పాలుపోలేదు. పోలి? మరి ఏలా సంస్కరించాలో—